# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-10-2023** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ ఉదయం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.**

**2. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లైవ్ స్టాక్ మిషన్‌ను రైతులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ మంత్రి కె.వెంకట నాగేశ్వరరావు సూచించారు.**

**3. ఆసియా క్రీడల్లో భారత్ 20 స్వర్ణ పతకాలతో సహా మొత్తం 83 పతకాలు సాధించింది.**

**4. 13వ వరల్డ్ కప్ క్రికెట్ పోటీలు ఈ రోజు నుండి భారత్‌లో ప్రారంభమవుతున్నాయి.**

**5. స్వాతంత్ర్య సమరయోధురాలు, గాంధేయ వాది కల్లూరి తులసమ్మ వర్ధంతి ఈ రోజు.**

============================

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ ఉదయం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సాయంకాలం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి భేటీ కానున్నారు. రాష్ట్రానికి రావలసిన నిధులు, పెండింగ్ బకాయిలపై కేంద్ర మంత్రితో చర్చించనున్నట్లు సమాచారం. దేశంలో వామపక్ష తీవ్రవాదం అంశంపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రేపు నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారు. రేపు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమై... రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రి చర్చించనున్నట్టు తెలుస్తోంది.

--------------------------

రాజకీయాల్లో అధికార, విపక్ష నేతలు ప్రత్యర్థులుగా ఉండాలే తప్ప... శత్రువులుగా ఉండరాదని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సూచించారు. హైదరాబాద్ నగరంలో నిన్న జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటూ... ద్వేషపూరిత, కుట్రపూరిత రాజకీయాలు వద్దని హితవు పలికారు. ప్రజా ప్రతినిధుల వ్యవహారశైలిని ప్రజలు గమనించి ఎన్నికల్లో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఓటు వేయాలని వెంకయ్య నాయుడు దిశానిర్దేశం చేశారు.

--------------------------

రాష్ట్రంలో ఔత్సాహిక రైతులు, యువకులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న లైవ్ స్టాక్ మిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూచించారు. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ కింద పశ్చిమ గోదావరి జిల్లా రైతుల కోసం తణుకు పట్టణంలో నిన్న జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల ప్రజలు పశు పోషణ ద్వారా ఆర్థిక

పురోగతి సాధించాలన్నది ఈ పథకం ముఖ్యోద్దేశమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల యువత ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గొర్రెలు, మేకలు, కోళ్లను పెంచడం ద్వారా పశు సంవర్ధక రంగాన్ని బలోపేతం చేయాలని కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూచించారు.

-------------------------

చైనా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారతీయ అథ్లెట్లు తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. మహిళల కాంపౌండ్ ఆర్చరీ విభాగంలో భారత ఆర్చర్లు జ్యోతి వెన్నం సురేఖ, అదితి స్వామి, పర్నీత కౌర్ బృందం స్వర్ణ పతకం సాధించింది. స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో దీపికా పల్లికల్-హరీందర్‌పాల్ సింగ్ సంధు జోడి మలేషియా జోడిపై విజయం సాధించి భారత్‌కు మరో స్వర్ణ పతకం అందించింది. దీంతో... భారత్ ఖాతాలో ఈరరోజు మరో రెండు స్వర్ణ పతకాలు చేరాయి. భారత్ సాధించిన పతకాల సంఖ్య 83కు చేరగా... వీటిలో 20 స్వర్ణ పతకాలు, 31 రజత, 32 కాంస్య పతకాలు వున్నాయి.

-------------------------

ఆసియా క్రీడల్లో భారతీయ క్రీడాకారులు అసాధారణ ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ఇప్పటి వరకు వివిధ క్రీడాంశాలలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తూ ఆయన సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. ఈ అద్భుత విజయాలకు భారత క్రీడాకారులు కఠోర శిక్షణ పొందడం, చిత్తశుద్ధితో ఆటను ప్రదర్శించడమే కారణమని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

-------------------------

ఫైబర్ నెట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఈరోజు వాదనలు ప్రారంభమయ్యాయి. చంద్రబాబు నాయుడు తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపిస్తున్నారు. బుధవారమే ఆయన వాదనలు వినిపించగా.. పూర్తిస్థాయిలో వినేందుకు తగిన సమయం లేకపోవడంతో విచారణను న్యాయమూర్తి నేటికి వాయిదా వేశారు.

మరోవైపు... స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు నాయుడు జ్యుడిషియల్ రిమాండ్ పొడిగించాలంటూ ఏసీబీ కోర్టులో సీఐడీ మెమో దాఖలు చేసింది. ఈ కేసులో రాజమహేంద్రవరం జైలులో ఉన్న ఆయనకు రెండోదఫా విధించిన రిమాండ్ గడువు ఈరోజుతో ముగియనుంది. ఇలాఉండగా... ఈ కేసులో చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో వాదనలు మళ్లీ ప్రారంభమయ్యాయి. నిన్నటి వాదనలకు కొనసాగింపుగా ప్రస్తుతం అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపిస్తున్నారు.

-------------------------

ఆబాల గోపాలాన్ని అలరించే 13వ వరల్డ్ కప్ క్రికెట్ పోటీలు ఈ రోజు నుండి భారతదేశంలో ప్రారంభమవుతున్నాయి. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నగరంలోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఈరోజు మధ్యాహ్నం ఇంగ్లండ్- న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో వరల్డ్ కప్ క్రికెట్ పోటీలు ఆరంభమవుతాయి.

ఇలాఉండగా... నవంబర్ 19వ తేదీన ఇదే స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. మొత్తం ఈ పోటీల్లో 48 లీగ్ మ్యాచ్‌లు, రెండు సెమీ ఫైనల్, ఆ తరువాత ఫైనల్ మ్యాచ్ జరుగుతాయి. 2011 సంవత్సరం తరువాత వరల్డ్ కప్ పోటీలకు భారతదేశం మరొకసారి ఆతిథ్యం ఇస్తోంది. గత పోటీల మాదిరిగానే ఈసారి కూడా 10 జట్ల మధ్య పోటీ జరుగుతోంది. ప్రతి జట్టు ఇతర 9 జట్లతో తలపడుతుంది. గ్రూప్-4లో అత్యధిక పాయింట్లు సాధించిన 4 జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరతాయి.

-------------------------

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన విశ్వకర్మ యోజనని చేతివృత్తుల కార్మికులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారని తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దెల గురుమూర్తి అన్నారు. తిరుపతిలో ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ... విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని విశ్వకర్మ యోజన పథకాన్ని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టారని చెప్పారు. ఈ పథకం ద్వారా తిరుపతి పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాలకు 531 కోట్ల రూపాయలను చేతివృత్తికారులకు అందించనున్నామని వివరించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ ఈ పథకం ద్వారా లబ్ధిని చేకూరుస్తామని గురుమూర్తి తెలియచేస్తూ...

వాయిస్ - 38 సెకన్లు

---------------------------

ప్రముఖ సంఘ సేవకురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు, గాంధేయ వాది కల్లూరి తులసమ్మ వర్ధంతి ఈ రోజు. గుంటూరు జిల్లా తెనాలి పట్టణ సమీపంలోని పెదరావూరు గ్రామంలో 1910 డిసెంబర్ 25వ తేదీన జన్మించిన ఆమె... మహాత్మాగాంధీ పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. పలుమార్లు జైలు జీవితం గడిపారు. అలంకరణలకు, ఆడంబరానికి చిహ్నంగా నిలిచే బంగారు నగలను త్యజించి చరఖాను చేతబట్టి ఖాదీ ఉద్యమానికి కూడా నాయకత్వం వహించారు. 2001 అక్టోబర్ 5వ తేదీన తుది శ్వాస విడిచే వరకు గాంధీ మార్గాన్ని అకుంఠిత దీక్షతో అనుసరించారు.

---------------------------

ఇంటర్ మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులు, మధ్యలో ఆపేసిన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువును వచ్చేనెల 30వ తేదీ వరకూ పెంచినట్లు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తెలిపారు. వీరికి రెగ్యులర్ సర్టిఫికెట్లు జారీ చేస్తామని... 2023, 2024 పరీక్షల్లో వచ్చిన మార్కుల్లో ఏవి ఎక్కువ ఉంటే వాటినే పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. కళాశాలకు వెళితే అమ్మఒడి, విద్యా కానుక పథకాలను అందిస్తామని పేర్కొన్నారు.

---------------------------

తెలుగుదేశం, జనసేన పార్టీల కలయిక హాస్యాస్పదంగా ఉందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. విజయవాడలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ రెండు పార్టీలకు విలువలు లేవని, ఈ పొత్తును ప్రజలు ఆమోదించరని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా పెడన పట్టణంలో నిన్న జరిగిన జనసేన పార్టీ బహిరంగ సభ విఫలమైందని జోగి రమేష్ పేర్కొన్నారు.

---------------------------

దసరా పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, పొరుగు రాష్ట్రాలకు 5 వేల 5 వందల ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్టు ఒక ప్రకటనలో తెలిపింది. అక్టోబర్ 13వ తేదీ నుండి 26వ తేదీ వరకు అందుబాటులో ఉండే... ఈ ప్రత్యేక సర్వీసులలో సాధారణ చార్జీలనే వసూలు చేస్తారని తెలిపింది. అయితే...రాను, పోను ముందస్తుగా రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ లభిస్తుందని ఆర్టీసీ తెలియజేసింది.

=====================